## అనగనగా... ఒక కథ

# వినాయకుడి చెవ్వులు

**వీధికి నాలుగు వైపుల నుంచి పాటలు-**
**నిన్నటివరకూ బోనాలు డప్పులూ... తీన్‌మార్ పాటలూ-**
**ఇప్పుడు పోటీ వినాయక పందిళ్లు**
**పోటాపోటీ మైకుసౌండ్‌లూ...**

అదికాక అలారం పెట్టినట్లు ఇంటిముందు సందులోనూ, వెనక సందులోనూ మారుమ్రోగే నమాజులు.

'ఓరి దేవుడోయ్' అని తిక్కగా అరుచుకున్నాడు రైటింగ్‌రూమ్‌లోంచి రైటర్ రాంపండు - దేవుళ్లకి ఎంత చెవులు ఉన్నా..వాళ్లేం చేయగలరు వినిపించాలిగా.

ఇవి చాలవన్నట్లు టెలిఫోన్లూ, ఆ కాల్స్‌కి కూడా అటూ ఇటూ మాటలకన్నా పాటల రొదలే ఎక్కువగా వినిపిస్తాయి -

అర్జెంట్‌గా రాయాల్సిన టీవీ కామెడీ నాటకం ఏడుస్తూ రాస్తే కామెడీ ఏమొస్తుంది - నా మొహం అనుకున్నాడు ఏడుమ్మొహం పెట్టుకుని.

పోనీ రాత్రి నైటౌట్ చేసి రాసేయాలి.

కంటికి రెప్పలిచ్చిన దేవుడు చెవులకి కప్పులు ఇవ్వడేంటి... నవ్వులాంటిది వచ్చినట్లుంది రాంపండుకి-

అంతలో దేవుడతనివైపున్నట్లు ఒక్కసారి నిశ్శబ్దం అయిపోయింది.

వావ్! వెరీగుడ్... గాడ్ ఈజ్ హై! అనుకున్నాడు.

చెవులకి మూతలిచ్చాడు- కొంపదీసి చెవుడు రాలేదుకదా... ఇంకో డౌట్ పెరిగింది.

ఏంటి దేవుడా ఇలా చేశావ్?

ఇది మరీ బాలేదు తండ్రీ.... నాకు శాపంగానీ పెట్టేయలేదు కదా- నేనూ లోలోపల ఆస్తికుణ్నే స్వామీ... అనుకునేంతలో...

ఢామ్మని మళ్లీ పాటలు విజృంభించాయి.

ఉలిక్కిపడ్డాడు. రాంపండు - ఆహా! దైవలీలెంత గొప్పది..అనుకుని, ఓహో- కరెంట్ పోయిందన్నమాట- పనున్నట్లు వెంటనే వచ్చేసిందన్నమాట- ఉక్కబోసి చెమట్లు పోసి చస్తుంటే గంటలగ్గంటలు పవర్ లేపేసి తమ పవర్ చూపిస్తారు శ్రీ ప్రభుత్వం వారు- ఇప్పుడిలా.. టప్‌మని తీసేసిన కరెంట్ గప్పున ఇచ్చేసి దైవభక్తి శబ్దం భజాయించి చెప్పుకున్నారు.

గంటలు గడుస్తున్నాయి...

మా ఆర్తి ఈపాటికి వచ్చేయాలే అనుకుంటూ టైమ్ చూసుకున్నాడు రాంపండు- డుర్రమని వైబ్రేషన్ మూడ్‌లో ఉన్న సెల్‌ఫోన్ గుండెల్లో గుబులిచ్చింది.

"యస్స్" అరిచాడు.

"ఎక్కడున్నారు" ఆర్తి ఆర్తనాదం గుర్తు పట్టాడు.

"ఇంటోనే.....ఇంటోనే... ఇం..టో..నే..." గొంతు చించుకున్నాడు.

"ఎక్కడా.. ఇంటోనేనా? కాలింగ్ బెల్ కొట్టానూ? తలుపు తీయండి- నేను ఎదురు షాపులో నుండే...."

ఉలిక్కిపడి లేచెళ్లి తలుపు తీశాడు.

పెద్ద ధ్వని ప్రభంజనంతో గబుక్కున లోపలికొచ్చి తలుపుమూశాక.. "ఎంతసేపు కాలింగ్ బెల్ కొట్టాను" నిష్టూరంగా అంది ఆర్తి.

"ఏమీ వినబడట్లేదు" సైగల్తో చెప్పాడు-మగడి మొహంలో ఏ ఫీలింగ్స్ చూసిందో... గొల్లుగొల్లున నవ్వసాగింది.

"మధ్యలో ఇదో సొద" అనుకుంటూ వినవిన తన రూమ్‌లోకి వెళ్లిపోయాడు రాంపండు.

మొగుడి బాధ అర్థమైంది అర్ధాంగికి- నవ్వాపుకుని, జాలి నటిస్తూ లోపలికెళ్లింది-

"ఏమైందండీ- పాపం మీ రచనా వ్యాసంగం..." అని అడిగీ అడగంగానే... తన గోల- అందులో గోడు తనకున్న టెన్షనూ... అన్నీ ఏకరువు పెట్టాడు..రాంపండు. అతని ఆవేశం చూస్తుంటే మైకులు పెట్టిన వాళ్లు ముందుంటే వాళ్ల పీకనొక్కేస్తాడేమో ఈయనగారు అనుకుని నవ్వు నొక్కుకుంది- "పాపం.. అసలే కామెడీ నాటిక అన్నారు కూడా" మొగుడు ఆవేశం ఎగురుడూ బైట వినిపిస్తూన్న పాటకి డ్యాన్సు ఆడుతున్నట్లే ఉంది అనుకుని పైకే నవ్వేసింది.

"చూడండి సారూ... ఈ రొద భరించలేనని ఇంట్లో కూచుని అనుకుంటున్నారు గనక అలా అనుకుంటున్నారు - నా మాట విని ఒక్క క్షణం అలా బైటకెళ్లి నిలబడండి - అక్కడకన్నా మనిల్లు ప్రశాంతంగా ఉన్నట్లు అనిపిస్తుంది"

"ఇదేం ఫార్ములా" విసుగ్గా అన్నాడు.

"ఇదే కరెక్ట్ ఫార్ములా! ప్రకృతి నేర్పే పాఠం అర్థం కాలేదా? ఇప్పుడు మనం ఇంట్లో ఉన్నప్పుడు.. ఎండ చంపేస్తోంది ఉష్ణోగిష్ణో అనుకుంటాం.... ఒక్క పావుగంట ఎండలో తిరిగొస్తే మన ఇల్లు చల్లగా ఉంటుంది. అలాగే చలీనూ - దుప్పట్లో ఉన్నంతసేపే చలి బాధ- విసిరేసి పక్కమీంచి లేచేసామనుకుందాం. చలీగిలీ ఉండవ్ - కదా"

"ఆపుతావా నీ సొదా?" నిజమే అనిపించినా మెచ్చుకుంటే ఇంకా రెచ్చిపోతుందని గయ్యిమనేశాడు రాంపండులో మొగు(గా)డు.

ఆర్తి అతనలా అన్నప్పుడు ఏం ఫీలవదు... ఎందుకంటే ఇంక అతని దగ్గర రిప్లయ్ లేనపుడే ఆ ఫుల్‌స్టాప్ పెడతాడు-

"నాకెందుకొచ్చింది గానీ మీ ఇష్టమే ఇష్టం- ఇదిగో వినాయకుడి కథ అక్షంతలు-నెత్తిమీద వేసుకెళ్లండి. నీలాపనిందలు రావుట మా అమ్మ చెప్పింది" తల మీదు వేసుకుని షడన్‌గా మొగుణ్నెత్తిన వేసింది-

"నాకిలాంటి నమ్మకాలు లేవు"

"మీ అత్తగారికీ, పెళ్లానికీ ఉన్నాయి" అనేసి వెళ్లిపోయింది - మళ్లీ వెనక్కొచ్చి..

"ఇంకో..పాయింటండోయ్... అసలూ నేను చెవుల్ని ఇల్లు కట్టుకుని పోరుతున్నా... మీరు వద్దనుకుంటే ఒక్క మాట కూడా వినపడనట్లు ఓవర్‌యాక్షన్‌తో నటించేయగలరు కదా- మీకీ పాటలు వినిపించట్లేదనుకోండి హాయిగా ఉంటారు" అంది ఆర్తి. నవ్వొ



చ్చింది రాంపండుకి- కావాలని వినిపించనట్లు నటించాడు.

చెవులు పెద్దవి చేసుకుని, బైటకి వెళ్లడానికే నిర్ణయించుకుని వెళ్లాడు.

రకరకాల వినాయకుళ్లు... రకరకాల వాహనాలు-

విత్తం కొద్దీ వైభోగంలా చందాలని బట్టి ఎత్తులు-

పందిర్ని బట్టి అందాలు.

వీధి చివర వేసిన భారీ పందిరిని రెండ్రోజుల్నించి గమనిస్తున్నాడు- ఇవ్వాళ ఫ్రంట్‌క ట్టిన కర్టెన్ తీసేరు-

కైలాసంలా అలంకరించిన వేదిక మీద పెద్దసైజు పార్వతమ్మ వళ్లో కూచున్నాడు హీరో- పార్వతి వరదా అభయహస్తాలకి మధ్యలో కరివదనం ఉందన్నమాట - అచ్చం వినాయకుడి చెవులు మూస్తోందా అన్నట్లు.. ఎవరి పిల్లలంటే వాళ్లకి ప్రేమ ఉంటుంది కదా!

ఇలా అనుకుంటూండగా కామెడీ నాటికకి మంచి పేరు తట్టింది- 'వినాయకుడి చెవులు!'

"ఛలో ఇంటికి" అని వచ్చి నాటిక రాయబోతుండగా... ఫోను "సార్..మనకి కామెడీ నాటిక ఎప్రూవల్ రాలేదు- ఎవరో ఫిలిమ్‌స్టార్ ఎప్రోచ్ అయ్యాడు- మనకి నెక్స్ట్ ఫెస్టివల్‌కి ఇస్తాట్ట" ప్రొడ్యూసర్ వాపోయాడు.

పెన్‌కేప్ పెట్టేశాడు రాంపండు.

విఘ్నేశ్వరుడు మంచి విఘ్నమే కలిగించాడు..అని ఆర్తీ రాంపండూ నవ్వుకున్నారు.

"ఏమైనా ఇది ఒక రకంగా మంచిదేనండీ. దేవుణ్ని విమర్శిస్తూ కథ రాస్తే ఈమధ్య కోర్టుల్లో కేసులు, కరపత్రాలూ వేసీ..... అందుకని ఆయనే బ్రేకు వేసీ...నీలాపనిందలు రాకుండా చేసీ....."

"ఆపుతావా నీ సొద!" అన్నాడు రాంపండు.

ఆర్తి నవ్వేసింది.

*